క్లుప్తంగా

రోడ్డు పనులకు భూమిపూజ



రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి పంచాయతీ శివారు బంగారయ్యపేట– చిట్టివానిపాలెం గ్రామాలకు గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ గిరిజనుల చిరకాల వాంఛ నెరవేర్చేందుకు ఉపాధి హామీ నిధులు రూ.18 లక్షలతో రోడ్డు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. పనులను త్వరగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు.అలాగే రామస్వామిపేట గ్రామంలో నిర్వహించిన రామాల య ప్రతిష్ఠోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామపెద్దలు చల్లా వెంకటరావు, గిరిజనులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు ఘనంగా నివాళి



సర్పంచ్ దాసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ రాజేశ్వరి, తదితరులు

దత్తిరాజేరు: పెదమానాపురం సర్పంచ్ గొటివాడ దాసు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. కుటుం బ సభ్యులు ఆయన సంతాప సభను పెదమానాపురంలో ఆదివారం నిర్వహించారు. జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సర్పంచ్ దాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జోరుగా వేసవి దుక్కులు



బొండపల్లిలో ట్రాక్టర్‌తో పొలం దున్నతున్న రైతు

బొండపల్లి: మూడు రోజుల క్రితం వర్షం కురవడంతో మండల వ్యాప్తంగా రైతులు వేసవి దుక్కులు ప్రారంభించారు. గ్రామాల్లో దుక్కులు జోరుగా సాగుతున్నాయి. పల్లం, మెట్టు భూములను ఖరీఫ్ పంటలకు సన్నద్ధం చేస్తున్నారు. ట్రాక్టర్లతో దుక్కులు చేయిస్తున్నారు. అలాగే పల్లపు భూముల్లో వేసవి నువ్వుల పంట సాగుకు రైతులు దుక్కులు చేయించి విత్తనాలు చల్లే పనిలో నిమగ్నమయ్యారు.

నిరుపయోగంగా...



ఆంజనేయపురంలో నిరుపయోగంగా ఉన్న పాత వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ భవనం

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురంలో పాత వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ భవనం నిరుపయోగంగా ఉంది. ఇదే ఆవరణలో ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంతో పాటు వ్యవసాయ మార్కెట్ యార్డు చీపురుపల్లి–గరివిడి పట్టణాల మధ్య ఆర్డీఓ కార్యాలయానికి సమీపంలోకి తరలిపోవడంతో అప్పటి నుంచి ఈ భవనం వినియోగానికి దూరంగా ఉంది. 2014 నుంచి 2019 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కిమిడి మృణా ళిని హయాంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంతో పాటు యార్డు ఆవరణలో ఖాళీ స్థలాన్ని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించారు. కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మాణం కోసం చీపురుపల్లి–గరివిడి పట్టణాల మధ్య ప్రస్తుత ఆర్డీఓ కార్యాలయ సమీపంలో స్థలాన్ని కేటాయించి నిధులు మంజూరు చేశారు. కానీ ఆ ప్రభు త్వంలో భవనాల నిర్మాణం ప్రారంభం కాలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దన్నాన జనార్దనరావు కొత్త మార్కెట్ యార్డు భవనాల నిర్మాణం విషయాన్ని అప్పటి రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లడంతో తిరిగి నిధులు మంజూరు చేయించారు. వెంటనే పనులను ప్రారంభించి భవనాలను నిర్మించారు. దీంతో అప్పటి నుంచి చీపురుపల్లి పట్టణంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వృథాగా మిగిలిపోయింది.

వేసవి శిక్షణ శిబిరానికి స్పందన

విజయనగరం టౌన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి విద్యార్థుల నుంచి నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆ శాఖ కార్యదర్శి లక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ.. చిట్టిబాబు మాస్టర్ ఆధ్వర్యంలో దేశభక్తి గేయాలు.. తమ్మిన షణ్ముఖ ప్రియ నేతృత్వంలో సంగీతం, నృత్యం నేర్పించారు. సుమారు 40 మందికి పైగా చిన్నారులు శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో షేక్ గౌస్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా బెల్టు షాపులు..!

- గ్రామాల్లో పాన్ షాపులతో సమానంగా బెల్టుషాపుల నిర్వాహణ
- ఏరులై పారుతున్న మద్యం
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు





గంట్యాడ మండలంలోని మురపాకలో బెల్టు షాపు వద్ద మద్యం తాగుతున్న మందుబాబులు

గంట్యాడ: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. పాన్ షాపు లేని ఊరు ఉంటుందో లేదో కానీ బెల్టుషాపు లేని ఊరు మాత్రం గజపతినగరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎక్కడా కనిపించడం లేదు.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఉన్న మద్యం పాలసీని రద్దు చేసింది. ప్రభుత్వం చేతిలో ఉన్న మద్యం షాపుల నిర్వాహణను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. దీంతోమద్యం షాపులు దక్కించుకున్న వ్యక్తులు కాసులు దండుకోవడం కోసం నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతు న్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లైసెన్స్‌డ్ మద్యం షాపుల నిర్వాహకుల ప్రోత్సాహంతో ఊరూరా బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. బహిరంగంగానే బెల్టుషాపులు నిర్వహిస్తున్నప్పటికీ ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు మండిపడుతున్నారు. బెల్టుషాపుల నిర్వాహకులు ఇచ్చే మామూళ్ల కోసమే అధికారులు ఇలా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

గుడి, బడి అనే తేడా లేదు...

గ్రామాల్లో గుడి, బడి అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడే బెల్టుషాపులు వెలశాయి. చిన్న గ్రామాల్లో 5 నుంచి 10 వరకు, పెద్ద గ్రామాల్లో 10 నుంచి 20 వరకు బెల్టుషాపులు వెలశాయి. ఈ షాపుల కోసం అధికార కూటమి నాయకులు దగ్గరుండి మరీ వేలం పాటలు వేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలు దక్కించుకున్న వారే బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. వ్యాపారం పెంచుకునేందుకు నిబంధనలకు పాతరేస్తూ బెల్టు దుకాణాలను ప్రోత్సహిస్తున్నారు. ఒక వ్యక్తికి మూడు సీసాలకంటే ఎక్కువ అమ్మకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా ఎవరు ఎంత అడిగితే అంత మద్యాన్ని కాదనకుండా ఇచ్చేస్తున్నారు. మీరు ఎంత కావాల్సిస్తే అంత అమ్ముకోండి, ఎంత సరుకు కావాల్సిస్తే అంత తీసుకు వెళ్లండి అని బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారనే విమర్శ లు వ్యక్తమవుతున్నాయి. కొన్ని లైసెన్స్‌డ్ దుకాణాల నిర్వాహకుల బరితెగించి తమ సిబ్బందితో బెల్ట్ షాపులకు డోర్ డెలివరీ చేస్తున్నారనే చర్చ జరుగుతోంది.

చర్యలు తీసుకుంటాం..

గ్రామాల్లో ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. అక్రమంగా మద్యం తరలిస్తున్న, విక్రయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నాం.

– విజయలక్ష్మి, విజయనగరం రూరల్ ఎక్సైజ్ సీఐ

ఘనంగా మరిడిమాంబ అనుపోత్సవం



శూలాలు గుచ్చుకుని ఊరేగుతున్న భక్తులు



పూజలందుకుంటున్న అమ్మవారు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో మరిడిమాంబ పండగలో భాగంగా అమ్మవారి అనుపోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని గాజులు, వివిధ పుష్పాలతో అలంకరించి, కుంకుమ పూజలు చేశారు. పలువురు భక్తులు శూలాలు గుచ్చుకుని పల్లకీలు లాగారు. అనుపోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ముగిసిన రామాలయ ప్రతిష్ఠోత్సవాలు



వేపాడ: రామస్వామిపేట రామాలయంలో ప్రతిష్ఠించిన సీతారామలక్ష్మణసమేత ఆంజనేయ స్వామి విగ్రహాలు



మెరకముడిదాం: కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండలంలోని చెల్లాపురంలో మూడురోజుల పాటు నిర్వహించిన కోదండ రామాలయ ప్రతిష్ఠోత్సవాలు ముగిశా యి. ఆదివారం ఉదయం 7.11 గంటలకు వేదపండితులు సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉత్సవాలకు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరయ్యారు. వేదపండితులు ఆయనకి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లా డుతూ గ్రామప్రజలతో పాటు అందరికీ శ్రీరామచంద్రుడి చల్ల ని దీవెనలు ఉండాలని కోరుకున్నానని తెలిపారు. సీతారామస్వామిని వైస్ ఎంపీపీ టి.హరిబాబు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్ కుమార్, పప్పల కృష్ణమూర్తి, పీఆర్టీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆల్తి రాంబాబు, మాజీ సర్పంచ్ కర్రోతు నాగేశ్వరరావు, పల్లికృష్ణమూర్తి తదితరులు దర్శించుకున్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

వేపాడ: మండలంలోని రామస్వామిపేట గ్రామంలో పునర్నిర్మించిన రామాలయంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలను గ్రామపెద్దలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండురోజులు వైభవంగా నిర్వహించారు. శనివారం, ఆది వారం రెండురోజులూ గ్రామస్తులు గ్రామస్తులు పూజలు చేశారు. విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం ఆదివారం మధ్యాహ్నం అన్నదానం చేశారు.

వాహన తనిఖీలు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం రైల్వే గేట్ వద్ద ఎస్ఐ జయంతి పోలీస్ సిబ్బందితో కలిసి ఆదివారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించా రు. వాహన చోదకుల లెసెన్స్, పొల్యూషన్ సర్టిఫి కెట్లు, ఇతర వాహన పత్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్రవాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువకులే చనిపోతున్నారని, దీనికి ప్రధాన కారణం మితిమీరిన వేగం, హెల్మెట్ ధరించకపోవడమేనని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై చర్యలు తప్పవన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కుంగిన కల్వర్టుపై ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

వేపాడ: మండలంలో నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే కొత్తవలస–ఆనందపురం ప్రధాన రహదారిలో కృష్ణారాయుడుపేట సమీపంలో రైవాడ కాలువపై కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టు కావడంతో పూర్తిగా శిథిలమై, కుంగిపోయింది.దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ సిబ్బంది ఇక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి సరిపెట్టిందే కానీ నూతన కల్వర్టు నిర్మాణానికి ముందుకు రావడం లేదు.ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి నూతన కల్వర్టు నిర్మించాలని ఆ మార్గంలో ప్రయాణించే వారు, కృష్ణారాయుడుపేట గ్రామస్తులు కోరుతున్నారు.

ఈతతో ప్రయోజనాలెన్నో..!

- జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్
- స్విమ్మింగ్ పూల్‌లో గడుపుతున్న చిన్నారులు, పెద్దలు



ఈత సాధన చేస్తున్న చిన్నారులు

విజయనగరం: వేసవి సెలవుల నేపథ్యంలో ఈత కొలనుల వైపు యువత, చిన్నారులు, పెద్దలు చూస్తున్నారు. ఆరోగ్యం.. ఆనందం.. ఉత్తేజానికి ఈత దోహదం చేస్తుంది. అలాగే ఈతలో రాణిస్తే ఎన్నో ప్రయోజనాలు కూడా ఉన్నాయి. విజయనగరం జిల్లా కేంద్రంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గల స్విమ్మింగ్ పూల్‌ను లీజ్ ప్రాతిపదికన థర్డ్‌పార్టీ నిర్వహిస్తోంది. అంతేకాకుండా శివారు ప్రాంతాలతో పాటు విజయనగరం మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రైవేట్ ఈత కొలనులు కూడా ఉన్నాయి. కొలనుల వద్ద శిక్షకులు ఉండి శిక్షణ ఇస్తున్నారు.

అనేక ప్రయోజనాలు

పిల్లలకు ఈత ఒక క్రీడ అయితే.. పెద్దలకు అది ఆరోగ్య సంజీవని. రోజులో కనీసం 30 నుంచి 40 నిమిషాల పాటు ఈత కొడితే ఎన్నో రకాల వ్యాధుల నుంచి బయటపడవచ్చు. ముఖ్యంగా ఊబకాయం సమస్య ఉండదు. మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్న వారికి ఈత మేలు చేస్తుంది. ఊహించని నీటి విపత్తులు ఎదురైనప్పుడు తమను తాము రక్షించుకోవడంతో పాటు ఇతరులకు సాయం చేసేందుకు ఈత దోహద పడుతుంది.

ఎన్నో అవకాశాలు

స్విమ్మింగ్‌ను ఒక క్రీడగా ఎంచుకుని రాణించే వారికి ఎన్నో అవకాశాలున్నాయి. స్కూలే గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఏటా ఈత పోటీలను నిర్వహిస్తుంది. స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) కూడా అంతర్జాతీయ పోటీలకు పిల్లల్ని తీసుకెళ్లేలా తీర్చిదిద్దుతుంది. ఒలింపిక్స్, ఆసియా క్రీడల్లాంటి పోటీల్లోనూ ఈత క్రీడకు చోటుండడంతో అంతర్జాతీయంగా రాణించే అవకాశం ఉంది. ఈతలో సత్తాచాటే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా వీరు శారీరకంగా, మానసికంగా ఎంతో దృఢంగా ఉంటారు.

పర్యవేక్షణ.. జాగ్రత్తలు ముఖ్యం..

- సాధారణంగా కొలను 3 నుంచి 10/12 అడుగుల లోతు ఉంటుంది. పిల్లల భద్రత దృష్ట్యా లైఫ్ జాకెట్లు తొడిగించి కొలనులో దించాలి.
- ఐదేళ్లు పైబడితేనే ఈత అలవాటు చేయాలి. వీరికి ప్రధానంగా తమను తాము నీటిలో రక్షించుకునే అంశాల్లో శిక్షణ ఇస్తారు.
- నెల నుంచి 45 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకునే సరికి నీటిలో ప్రమాదాల నుంచి బయటపడేలా చిన్నారులు మారుతారు. అదే అలవాటుగా చేసుకున్న వారైతే ఎన్నో రకాల జల క్రీడల వైపు అడుగులేసే అవకాశం ఉంది.
- బాలురు నైలాన్ షర్ట్, తలకు క్యాప్, స్విమ్మింగ్ కళ్లజోడుతో ఈతకు దిగాలి. అదే బాలికలకు ప్రత్యేకంగా స్విమ్ సూట్లు మార్కెట్లో ఉన్నాయి.
- కొలనులో దిగే ముందు.. ఈత తర్వాత కచ్చితంగా స్నానం చేయాలి.
- సామర్థ్యానికి మించి ఎక్కువమంది ఒకేసారి ఈతకు దిగడం మంచిది కాదు. 25/15 మీటర్ల విస్తీర్ణంలో కొలను ఉంటే గరిష్ఠంగా ఒక విడతలో 40 మందికి మించి ఈత కొట్టకూడదు.

ఈత మంచి క్రీడ..

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి క్రీడకూ మంచి ఆదరణ లభిస్తోంది. ప్రధానంగా అంతర్జాతీయ స్థాయిలో ఈతకు మంచి ప్రాధాన్యత ఉంది. ఈ క్రీడలో రాణించే వారు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులుగా ఉంటారు. కేవలం చిన్నారులే కాకుండా పెద్ద వయస్సు గల వారు ఆచరించడం మంచిది.

– శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు.

సత్యసాయి ప్రేమ ప్రవాహిని ర్యాలీ



సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పుట్టపర్తి నుంచి విజయనగరం జిల్లాకు వచ్చిన సత్యసాయి ప్రేమ ప్రవాహిని ప్రచార రథం ఆదివారం వేపాడ మండలంలోని బానాది,బల్లంకి గ్రామాల మీదుగా ఎస్.కోట చేరుకుంది. రథానికి ఆయా గ్రామాల్లో మహిళలు పూర్ణ కలశాలతో స్వాగతం పలికారు. గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈసందర్భంగా సత్యసాయి సేవామండలి సభ్యులు సత్యసాయి ప్రేమతత్వాన్ని, ఆయన జీవిత విశేషాలను వివరించారు. ఏప్రిల్ 24న పుట్టపర్తిలో సత్యసాయి ప్రేమ ప్రవాహిని ప్రచార రథాలు అన్ని జిల్లాలకు బయలుదేరాయని, గ్రామాల్లో ప్రచారం పూర్తి చేసుకుని తిరిగి పుట్టపర్తి చేరుకుంటాయని తెలిపారు. – వేపాడ

విద్యార్థులకు సన్మానం



పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన చందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఆ పాఠశాల వేదికగా స్కూల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. దాతల సహకారంతో నగదు బహుమతులు అందజేశారు. 573 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచిన విద్యార్థి ఎస్.తేజకు రూ.5 వేలు, 567మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన గీతంకుమార్‌కు రూ.3వేలు, 560 మార్కులు సాధించిన ఎస్.మహేష్‌కు రూ.2,016లు అందించారు. అలాగే 500కుపైగా మార్కులు సాధించిన మరో ఎనిమిది మంది విద్యార్థులకు స్కూల్ కమిటీ చైర్మన్ బి.సన్యాసిరావు సహకారంతో రూ.500 చొప్పున అందజేశారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. – లక్కవరపుకోట

సేవాదృక్పథం కలిగి ఉండాలి



ప్రతీ ఒక్కరు సేదా దృక్పథం కలిగి ఉండాలని చిన్నరావుపల్లి సర్పంచ్ బూసాల దేముడు,జిల్లా వాలీబాల్ అసోసియేసన్ అధ్యక్షుడు కృష్ణంరాజు అన్నారు. కొత్తవలస మండలంలోని తుమ్మికాపల్లికి చెందిన ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆదివారం 45 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ విశ్వనాథ హరికుమార్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. – కొత్తవలస

ఇంటింటికీ భగవద్గీత



ఎస్.కోటకు చెందిన మోక్ష విద్య యోగమందిర్ ఆధ్వర్యంలో ఆదివారం 'ఇంటింటికీ భగవద్గీత' కార్యక్రమం నిర్వహించారు. మోక్ష విద్య యోగమందిర్ కార్యదర్శి శీలా కోటేశ్వరరావు, సభ్యులు ఎస్.కోట పట్టణంలోని రామ్‌నగర్, బంగారమ్మ క్వార్టర్స్‌లో ఇంటింట ప్రచారం చేసి, ప్రజలకు ఉచితంగా భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భగవద్గీత పఠనం భారతీయుని కర్తవ్యమని, ప్రతీ ఇంటిలో భగవద్గీత ఉండాలని అన్నారు. – శృంగవరపుకోట

నైతిక విలువలతో కూడిన విద్య అవసరం



శిక్షణ శిబిరంలో విద్యార్థులకు బోధిస్తున్న శ్రీహరి శర్మ

లక్కవరపుకోట: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య బోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సుపథ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఏ.శ్రీహరిశర్మ అన్నారు. సుపథ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సీతారామస్వామి ఆలయం వద్ద చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన జ్ఞానయజ్ఞం వేసవి శిక్షణ శిబిరాన్ని ఆదివారం ప్రారంభించా రు.తొలిరోజు చిన్నారులకు యోగాసనాలపై అవగాహన కల్పించి, వారితో ఆసనాలు వేయిం చారు. అనంతరం సంస్థ ప్రతినిధి శ్రీహరిశర్మ మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, సంప్రదాయా లకు అనుగుణంగా ఉపాధ్యాయులు పిల్లలకు బోధించాలని సూచించారు. అందుకు అనుగుణంగా సుపథ సంస్థ కృషి చేస్తోందని చెప్పారు. నెల రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు ఇతిహాసాలు,పురాణాలు,సంస్కృతీ సంప్రదాయాలపై బోధిస్తామని తెలిపారు.

వృద్ధాశ్రమానికి వితరణ



వృద్ధాశ్రమానికి కూలర్లు అందజేస్తున్న దాతలు

విజయనగరం: వృద్ధాశ్రమానికి ఎన్ఆర్ఐలు అందించిన సహాయం వెలకట్టలేనిదని విజయనగరం పట్టణంలోని వెంకటసాయి వృద్ధాశ్రమ నిర్వాహకుడు కట్టమూరి ఆంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక ప్రదీప్‌నగర్‌లో ఉన్న వెంకటసాయి వృద్ధాశ్రమానికి ఎన్ఆర్ఐలు వాణి, ఉదయ్, తదితర మిత్రబృందం సమకూర్చిన ఐదు కూలర్లు, రెండు మినరల్ వాటర్‌ప్లాంట్లలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ..ఉద్యోగరిత్యా అమెరికాలో ఉన్నప్పటికీ పుట్టి పెరిగిన ప్రాంతాన్ని మర్చిపోకుండా ఇక్కడి వృద్ధాశ్రమానికి ఆరు నెలలకు సరిపడేలా నిత్యావసర సరుకులు, కూలర్లు, మినరల్ వాటర్ ప్లాంట్లను సమకూర్చిన విద్యార్థుల ఉన్నత భావాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. కార్యక్రమంలో ఆంజనేయులు దంపతులతో పాటు వాసవీ క్లబ్ ప్రతినిధులు మండవిల్లి వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.